క్లుప్తంగా

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



తోటపల్లిగూడూరు: భూసార పరీక్షలకు అనుగుణంగా వరి పంటకు ఎరువులను వాడుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు పేర్కొన్నారు. ఇస్కపాళెం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బందికి మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులను వాడుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆమ్ల, క్షార భూములను గుర్తించవచ్చన్నారు. అనంతరం పంట పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నర్సోజీరావు, ఏఓ శిరీషారాణి, వీఏఏలు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలపై అవగాహన అవసరం



మనుబోలు: విద్యార్థులు బ్యాంకు సేవలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ శేషాద్రివాసు అన్నారు. విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించేందుకు ఆర్‌బీఐ ఆదేశాల మేరకు స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి ఆల్ ఇండియా క్విజ్ పోటీలను బుధవారం నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.5 వేలు,రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏపీజీబీ మేనేజర్ నిఖిల్, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీకాంతారావు, వసంతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు : ఆల్ ఇండియా క్విజ్ పోటీల్లో భాగంగా స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినులకు మండల స్థాయి పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ జీహెచ్‌ఎస్‌కు చెందిన కే స్నేహిత(10వ తరగతి), ఎం సాయిదేవిక (9వ తరగతి), అమ్మవారిపాళెం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎస్ పల్లవి(10వ తరగతి), వీ కుసుమ(9వ తరగతి), తాటిపర్తి వైకేకే జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఆర్ లక్ష్మీ సాద్విక(10వ తరగతి), పీవీ తన్విక(9వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మనుబోలు: భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఐఆర్పీఎస్‌లు శ్యామల, షర్మిల కోరారు. మనుబోలు భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిత కేంద్రానికి రాలేక ఇళ్ల వద్దే ఉండి తమ సలహాలు, సూచనలతో చదువుకునే దివ్యాంగ విద్యార్థులకు నెలకు రూ.300 అందజేస్తున్నామని తెలిపారు. భవిత కేంద్రానికి వచ్చే విద్యార్థులకు రవాణా చార్జీల కోసం నెలకు రూ.300, యూనిఫామ్, బూట్లు అందజేస్తున్నామని చెప్పారు. బాలికలకు అదనంగా నెలకు రూ.2500 స్టైఫండ్ అందజేస్తున్నామని తెలిపారు. ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ సేవలను అందిస్తున్నామని వివరించారు.

ఉపాధ్యాయుడికి ఇన్‌స్పైర్ అవార్డు

కోవూరు: పడుగుపాడు నేతాజీనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జీ కోదండరామయ్య నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవాని, ఏపీసీ ఉషారాణి చేతుల మీదుగా బుధవారం ఇన్‌స్పైర్ అవార్డు అందుకున్నారు. ఆయన విద్యార్థులకు వినూత్న పద్ధతుల్లో ఉత్తమ బోధన అందిస్తూ ప్రోత్సహిస్తుండడాన్ని గుర్తించి ఇన్‌స్పైర్ అవార్డును ప్రదానం చేసి సత్కరించారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు, జగదేవిపేట పీహెచ్‌సీల పరిధిలోని అంగన్‌వాడీ చిన్నారులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో 93 మంది చిన్నారులకు పరీక్షలు చేశారు. పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారంపై తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో యోగాసనాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్రవంతి



డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో..



కొండాయపాళెంలోని ప్రాథమిక పాఠశాలలో..



నారాయణ మెడికల్ కళాశాలలో..



జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని పలువురు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం నిర్వహించారు.

- యోగా సాధనతో ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం పెంపొందుతుందని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో యోగా సాధన తరగతులను ఆయుష్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్వో ప్రసాద్, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, ఆయుష్ వైద్యుడు వినోద్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో యోగాసనాలను శిక్షకురాలు అరుణ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపల్ గిరి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ఉమామహేశ్వరి, దివ్య, నాగరాజు, ఎన్‌సీసీ అధికారి కళాప్రియ, ఫిజికల్ డైరెక్టర్ విజయకళ, పీఆర్వో జోజీ, తదితరులు పాల్గొన్నారు.

- కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, రాశి, తదితరులు పాల్గొన్నారు.
- పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగాసనాలను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన సుకుమార్, సంతోష్‌కుమార్ రెడ్డికి ప్రశంసపత్రాలు, మెడల్లను అందజేసి అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- హరనాథపురంలోని పీపుల్స్ పార్క్‌లో యోగా దినోత్సవాన్ని శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ట్రెయినర్ మురళి, చిన్నయ్య, రామలింగేశ్వరరావు, రవీంద్రరెడ్డి, అనిల్‌కుమార్, తిరుపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.
- నారాయణ మెడికల్ కళాశాలలో యోగా దినోత్సవాన్ని ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల హెచ్‌ఓడీ విశ్వకుమార్, డాక్టర్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): యోగాతో ఆరోగ్యాన్ని పొందవచ్చని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్ పేర్కొన్నారు. దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు అనుబంధ సర్వజన ఆస్పత్రిలో యోగా దినోత్సవాన్ని డాక్టర్లు, వైద్య సిబ్బంది నిర్వహించారు. డాక్టర్లు కళారాణి, శివరామ్, రోజారమణి, తదితరులు పాల్గొన్నారు.

- ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా ఒక వరమని యోగా వెల్నెస్ ఇన్‌స్ట్రక్టర్ సునోలా, మెడికవర్ స్పెషాల్టీ ఆస్పత్రి సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ పేర్కొన్నారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బందికి యోగా శిక్షణను నిర్వహించారు. అనంతరం యోగాసనాలు వేశారు. మార్కెటింగ్ రీజినల్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్, పీఆర్వో చందువర్మ, తదితరులు పాల్గొన్నారు.
- దర్గామిట్టలోని కిమ్స్ హాస్పిటల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా ప్రాధాన్యాన్ని శిక్షకురాలు ప్రవీణలత వివరించారు. హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు, మెడికల్ సూపరింటెండెంట్ ఏవీ రెడ్డి, డాక్టర్లు వెంకటకృష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుజబుజనెల్లూరులోని శేష స్కూల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా మాస్టర్ పెంచలయ్య, ఎల్ఐసీ మేనేజర్ మాలకొండయ్య, పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్షుడు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బారకాసు): రామ్మూర్తినగర్‌లోని సత్యసాయి భజన మందిరంలో సామూహిక యోగా కార్యక్రమాన్ని సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సేవా సమితి కన్వీనర్ సురేష్‌సింగ్, సాయి హృదయ కన్వీనర్ కొండా శేషగిరిరావు, సేవాదళ్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(లీగల్): యోగా సాధనతో ఆరోగ్యంగా ఉండొచ్చని జిల్లా జడ్జి యామిని పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు నగరంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ రామశ్రీనివాసరావు, న్యాయమూర్తి అఖిల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమమహేశ్వరరెడ్డి, జాయింట్ సెక్రటరీ అన్వర్‌బాషా, లోక్‌అదాలత్ న్యాయ సహాయ సభ్యులు టంగుటూరు గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పెద్దాస్పత్రిలో..



మెడికవర్‌లో..



కిమ్స్‌లో..



బుజబుజనెల్లూరులో..



సత్యసాయి భజన మందిరంలో..

నగదు ప్రోత్సాహకాల ప్రదానం



నెల్లూరు (టౌన్): పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఫతేఖాన్‌పేటలోని రామయ్యబడికి చెందిన ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను బుధవారం అందజేశారు. సుశాంత్ 567, సంతోష్ 528, తేజశ్రీ 506 మార్కులను సాధించడంతో పాఠశాల పూర్వ విద్యార్థి, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సతీష్ కుమార్ రూ.ఐదు వేలు, విశ్రాంత బీఎస్‌ఎన్‌ఎల్ అధికారి రూ.8 వేలు, స్పెషల్ బ్రాంచ్ సీఐ షఫీ రూ.ఐదు వేలను ఇచ్చారు. పేద విద్యార్థి సంతోష్ ఇంటర్ చదివేందుకు అవసరమైన ఖర్చులకు రూ.పది వేలను పీడియాట్రిక్ సర్జన్ సురేష్‌బాబు అందజేశారు. ఉపాధ్యాయులు సుబ్బారావు, మధుమోహన్, మల్లికార్జున, రియాజ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సనత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

‘జెనెక్స్’ విద్యార్థులకు ఎస్పీ అభినందన



నెల్లూరు (టౌన్): ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో అత్యధిక వేతనాలు సాధించిన జెనెక్స్ విద్యార్థులను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అభినందించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రూ.18 లక్షల ప్యాకేజీ సాధించిన పూజ, వేణుగోపాల్‌నాయక్.. రూ.పది లక్షలు సాధించిన విద్యార్థులకు ఎస్పీ అభినందనలను తెలియజేశారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న వినోద్

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని పట్టణ ఆరోగ్య కేంద్రాల రాష్ట్ర అసెస్‌మెంట్ ఆఫీసర్ వినోద్ పేర్కొన్నారు. ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని రామాలయ వీధి, టైలర్స్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను డీపీఎంఓ హరిశ్చంద్రసతీష్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, మందుల స్టాక్‌లు, ఇతర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడారు. పేదలకు మరింత నాణ్యమైన వైద్యసేవలను అందించాలనే ఉద్దేశంతో ఆస్పత్రులను అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. సమయపాలన పాటిస్తూ మంచి సేవలను అందించాలని సూచించారు. డాక్టర్లు సాయిప్రతీక్, ఐశ్వర్య, తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించారు. మార్చి ఒకటి నుంచి జూన్ 21 వరకు కానుకల రూపంలో రూ.31,04,466ను భక్తులు సమర్పించారని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ తెలిపారు. అన్నదాన హుండీలో రూ.1,69,436 నగదు, 74 అమెరికన్ డాలర్లు, ఐదు దిర్హమ్స్‌ను సమర్పించారని పేర్కొన్నారు. వేణుగోపాలస్వామి దేవస్థాన ఈఓ చంద్రశేఖర్‌రావు, దేవదాయ శాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): సంక్షేమ పథకాలను అర్హులకు అందించే అంశంలో వలంటీర్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. బీవీనగర్‌లోని సిద్ధార్థ కళాశాల ఆవరణలో వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నూరు శాతం అందించేలా జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం శ్రీకారం చుట్టనున్నారని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో సర్టిఫికెట్లను ఉచితంగా జారీ చేయనున్నారని తెలిపారు. జేసీఎస్ మండల కన్వీనర్ మొయిళ్ల సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్
- బాలిక మృతి, తల్లికి తీవ్ర గాయాలు
- పూడి క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం



యమున (ఫైల్)

పుత్తూరు రూరల్(తిరుపతి జిల్లా): షాపింగ్‌కు బయలుదేరిన తల్లీ కుమార్తె ఆనందం అంతలోనే ఆవిరైంది. కుమార్తెను ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించగా, తల్లి తీవ్రంగా గాయపడింది. వడమాలపేట– పూడి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన విషాదాన్ని నింపింది. ఆస్పత్రి వద్ద బంధువులు, గ్రామస్తుల ఆర్తనాదాలు మిన్నంటాయి. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల పంచాయతీ అమ్మవారితోపు గ్రామానికి చెందిన గౌతమ్ తిరుపతిలో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. భార్య ప్రశాంతి, కుమార్తె యుమున(14), కుమారుడు మోక్షిరుషి(8)తో కలసి బ్రాహ్మణపట్టులో నివాసం ఉంటున్నాడు. పత్తిపుత్తూరు హైస్కూల్లో యమున(అమ్ము) 9వ తరగతి, మోక్షిరుషి 3వ తరగతి చదువుతున్నారు. బుధవారం సాయంత్రం ‘అమ్మా! స్కూల్ నుంచి వచ్చేశా... అంటూ ఆప్యాయంగా పలకరించింది యమున. సరే అమ్మా!..‘పేటకు వెళ్లి సిలిండర్ తేవాలి, షాపింగ్ చేయాలి రెడీ అవ్వు’ అంటూ తల్లి చెప్పింది. రెడీ అయిన తల్లీ కుమార్తె వడమాలపేట మండలం బ్రాహ్మణపట్టు నుంచి సిలిండర్‌తో స్కూటర్‌పై బయలుదేరారు. వడమాలపేట–పూడి క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా మామిడి కాయల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో కిందపడిన యమున తలపై ట్రాక్టర్ చక్రం ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రశాంతి తీవ్రంగా గాయపడగా తిరుపతి రుయాకు తరలించారు. యమున మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వడమాలపేట ఎస్‌ఐ రామాంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్ చొరవతో జనన ధ్రువీకరణలు సులభతరం

కొడవలూరు: కలెక్టర్ చొరవతో చిన్నారులకు జనన ధ్రువీకరణలు సులభతరమయ్యాయని జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి పేర్కొన్నారు. మండలంలోని 80 మంది చిన్నారులకు ఐసీడీఎస్ అధికారులు ఆస్పత్రుల ద్వారా మంజూరు చేయించిన జనన ధ్రువీకరణలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఈఓ మాట్లాడుతూ చిన్నారులకు జనన ధ్రువీకరణలు లేకపోవడంతో ఆధార్ పొందలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమస్యపై కలెక్టర్ ప్రత్యేక చొరవ కనబరిచి ఐసీడీఎస్, వైద్య, సచివాలయ సిబ్బంది ద్వారా సులభంగా జనన సర్టిఫికెట్లు పొందే వెసులుబాటు కల్పించారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అనేక మంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం అభినందనీయమని కొనియాడారు. కావలి డీఎల్‌డీఓ కనకదుర్గా భవాని మాట్లాడుతూ కలెక్టర్ ప్రయోగాత్మకంగా చేపట్టిన జనన ధ్రువీకరణల ప్రత్యేక డ్రైవ్ సత్ఫలితాలు ఇస్తోందన్నారు. జనన ధ్రువీకరణలు లేని చిన్నారుల తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కల్తీ సరుకులు విక్రయిస్తే కేసులు



మాట్లాడుతున్న కూర్మనాథ్

నెల్లూరు(పొగతోట): వినియోగదారులకు కల్తీ సరుకులను విక్రయిస్తే సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ హెచ్చరించారు. నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫుడ్ సేఫ్టీ, తదితర అంశాలపై వ్యాపారులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను తప్పక పాటించాలని సూచించారు. వినియోగదారులకు నాణ్యమైన పదార్థాలను సరఫరా చేయాలని, వారిని నష్టపరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. శిక్షణలో చెప్పిన అంశాలను తప్పక పాటించాలని ఆదేశించారు. అనంతరం అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లు, వీధి వ్యాపారులు విక్రయిస్తున్న ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నామన్నారు. నూనెలను పదేపదే వినియోగిస్తుండటంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. దీన్ని పరిశీలించేందుకు ప్రత్యేక పరికరం అందుబాటులో ఉందని చెప్పారు. నూనెలను కల్తీ చేసేవారిపై రూ.రెండు లక్షల వరకు జరిమానాను విధించనున్నామని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, వివిధ శాఖల అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



నెల్లూరు (టౌన్): నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఈసీ ప్రథమ సంవత్సర విద్యార్థి శ్రావిక 500కు 488 మార్కులను సాధించడంతో బుధవారం అభినందించారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గురవయ్య, అధ్యాపకులు హరికృష్ణ, చెంచయ్య, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలకు వినతి



నెల్లూరు (టౌన్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు, పుస్తకాలను విక్రయిస్తున్న కేకేఆర్స్ గౌతమ్ స్కూల్‌పై కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని పాఠశాల ఎదుట ఆందోళనను బుధవారం చేపట్టారు.

అపంతరం పాఠశాల వద్దకు వచ్చిన డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి, ఎంఈఓ తిరుపాల్‌కు ఫిర్యాదు చేశారు. నేతలు కిరణ్, సంతోష్, నరేంద్ర, సుకుమార్, హర్షపవన్, సోనూ, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీఎస్సార్ ఆస్పత్రి సబ్‌స్టేషన్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇండోర్ సబ్‌స్టేషన్‌కు మార్చనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం ఉండదని టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేక్‌వ్యూ కాలనీ, ప్రగతినగర్‌లోని ఏ, బీ బ్లాక్‌లు, జెడ్పీ కాలనీ 1, 2వ వీధులు, పొదలకూరు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నగదు పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): నగరంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నామని బాలాజీనగర్ బ్రాహ్మణ సేవా సంఘ కార్యదర్శి కాంతారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ దరఖాస్తులను జూలై ఐదులోపు అందజేయాలని కోరారు. వివరాలకు 99856 84814, 94412 46191 నంబర్లను సంప్రదించాలని సూచించారు.